క్లుప్తంగా

లక్ష్మీపల్లి వాసికి పురస్కారం



చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన మంగదొడ్డి నరసింహ హైదరాబాద్‌లోని ఐఐటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. కేంద్ర ఖనిజ విభాగం 2023 ఏడాదికి గాను ఆయన జియోఇన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా రాష్ట్రపతి భవన్‌లో అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా మినరల్ బెనిఫిషియేషన్, ఎన్‌జీఆర్‌ఐ అభివృద్ధి రంగాల్లో ప్రొ.నరసింహ విశేష కృషి చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి



ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణ కోసం వినాయకచవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించాలని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంలో వినాయక మండపాల నిర్వాహకులు, అఖిలపక్ష నాయకులతో సమావేశమయ్యారు. ప్లాస్టర్ ఆఫ్‌పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో నదులు, చెరువుల్లోని నీరు కలుషితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటించి సహకరించాలని కోరారు.

నారాయణ గురుకు ఘన నివాళి



వనపర్తిటౌన్: మతం కోసం మనిషి కాదు మనిషి కోసమే మతమని చాటిచెప్పిన మహానుభావుడు నారాయణగురు అని మహానీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాం ప్రకాశ్ అన్నారు. నారాయణగురు జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహానీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, మండ్ల దేవన్న నాయుడు, బాలేమియా, బండలయ్య, వెంకటస్వామి, రవి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పులో పాము పట్టివేత



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్లలో గుండ్రాతి లక్ష్మణ్‌గౌడ్ ఇంటి పైకప్పులో పాము వేలాడం గమనించిన ఆయన కుమార్తె దివ్యశ్రీ గమనించి తండ్రికి సమాచారం ఇచ్చింది. అతడు జిల్లా సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు ఫోనులో సమాచారం ఇచ్చారు. ఆయన గ్రామానికి చేరుకొని లక్ష్మణ్‌గౌడ్ ఇంటి పైకప్పులోని జెర్రిపోతు పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణానికి చెందిన మేకల రాజు, లక్ష్మణ్, పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన ముంత బీచుపల్లి తమ సెల్‌ఫోన్లు పాగొట్టుకున్నట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గుర్తించి రికవరీ చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో బాధితులకు ఫోన్లు అప్పగించారు.

'ఖిల్లా'లో జోరువాన

ఖిల్లాఘనపురం: మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జోరుగా వాన కురిసింది. ఈ సంవత్సరం మొదటి నుంచి ముసురువానలు తప్ప పెద్ద వర్షం కురిసింది లేదు. దీంతో పత్తి తదితర మెట్ట పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఇంతలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల మీదుగా ప్రవహించే పెద్ద వాగుకు వరద పోటెత్తింది. అప్పారెడ్డిపల్లిలో తిమ్మావాడికె, సల్కెలాపురం రోడ్డుకు కట్టు కాల్వ తదితర అన్ని గ్రామాల్లో వాగులు, వంకలు పారాయి. చెరువులు, కుంటల్లోకి కొంతమేరకు నీళ్లు చేరాయి.



భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

కొత్తకోట రూరల్: డప్పుల వాయిద్యాల మధ్య తెలంగాణ సంస్కృతి.. సంప్రదాయం ఉట్టిపడేలా మంగళవారం పోచమ్మకు బోనాలు గ్రామాల్లోకనులపండువగా జరిగాయి. కొత్తకోటతో పాటు కానాయపల్లిలో మహిళలు, చిన్నారులు బోనాలతో పోచమ్మ గుడి వద్దకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యాదవ మహిళలు కుర్వ డోళ్లు, తప్పెట్లు తదితర వాయిద్యాలతో ఒకేసారి బోనాలతో పోచమ్మ ఆలయానికి రావడంతో చూపరులను ఆకర్షించింది. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పల్లెలు కళకళలాడాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

మదనాపురం: మండలంలో మంగళవారం పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి పండుగ వాతావరణం నెలకొంది. దుప్పల్లి, మదనాపురం, దంతనూరు, శంకరమ్మపేటలో భక్తులు బోనం కుండ ఊరేగింపుతో అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని మర్రికుంట కాలనీలో, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ప్రత్యేకంగా అలంకరించిన బోనం కుండలో తయారు చేసిన వంటకాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



కొత్తకోటలోని గణేష్‌నగర్ కాలనీ నుంచి బోనాలతో వెళ్తున్న మహిళలు



శ్రీరంగాపురంలో..



దుప్పల్లిలో..



కానాయపల్లిలో..

దోమల నియంత్రణకు చర్యలు

వీపనగండ్ల: దోమకాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడే రోగాల బారిన పడకుండా ఉంటామని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మలేరియాకు కారణమైన క్రిమిని కనుగొన్న సర్ రోనాల్డ్‌రాస్ గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే అంటువ్యాధుల సోకకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాంచంద్రమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజశేఖర్

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంతం –ప్రభోద సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 29వరకు పట్టణ కేంద్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు అనుమతి కోరడంతో పాటు పోలీసులు సైతం పాల్గొనాలని కోరుతూ ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డికి త్రైత సిద్ధాంత సేవాసమితి సభ్యులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ స్పందిస్తూ జన్మాష్టమి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, అవాంఛిత ఘటనలు జరిగితే నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని అన్నారు. ఎస్‌ఐని కలిసిన వారిలో త్రైత సిద్ధాంతం మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు తదితరులు ఉన్నారు.



ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

అమరచింత: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పాలన కుంటుపడిందన్నారు. పంచాయతీలో నిధులు లేని కారణంగా ప్రత్యేక అధికారులు సైతం తమ తమ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి దాపరించింది. వర్షాకాలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని, దోమల నివారణ కోసం ఫాగింగ్ సైతం చేపట్టడం లేదని వాపోయారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మురుగుకాల్వలు శుభ్రపర్చాలని, బ్లీచింగ్ చల్లాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులుకు అందించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు హరీశ్, చంటి, ఫయాజ్ పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి దరఖాస్తుల స్వీకరించండి

అమరచింత: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని తహసీల్దార్ రమేష్‌రెడ్డికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ప్రారంభించి ఏడాదికి మూడు సార్లు రూ.2వేల చొప్పున రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమచేస్తుందన్నారు. 2019 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే డబ్బులు జమ అవుతున్నాయన్నారు. 2019 తర్వాత పట్టా బుక్కులు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతియేటా రైతుబంధు, రైతుబీమాకు కొత్తగా రైతులకు అవకాశం కల్పిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పీఎం కిసాన్‌కు సంబంధించి అలాంటి వెలుసుబాటు కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ, ప్రత్యేక యాప్‌లు తెచ్చిందని పీఎం కిసాన్ సమ్మన్ నిధి కూడా ఇలాంటి అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్, మల్లేష్, నిషాంత్, షేక్‌పాషా పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కార్మికులకు రూ.2 లక్షల బీమా

ఆత్మకూర్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రధానమంత్రి సురక్ష యోజనలో భాగంగా రూ. 2 లక్షల బీమా సౌకర్యం కల్పించినట్లు ఎంపీఓ శ్రీరాంరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి కార్మికుల నుంచి దరకాస్తులు స్వీకరించారు. మండలంలోని పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న 56 మంది కార్మికుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని, 18 నుండి 50 ఏళ్లలోపు వారికి రూ.2 లక్షలు, 50 నుంచి 70 ఏళ్ల వారికి రూ.లక్ష బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. దరఖాస్తులను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించామని పేర్కొన్నారు.



అక్కాతమ్ముళ్ల ప్రేమకు ప్రతీక రాఖీ



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి

పాన్‌గల్: ఆడపడుచులందరికీ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పాన్‌గల్ మండల కేంద్రంలో తన సోదరీమణులు అనసూయమ్మ, సుదర్శనమ్మ, బాలకిష్టమ్మ, శశిరేఖమ్మతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి రాఖీ కట్టించుకొని అక్కలకు పాదనమస్కారం చేసి ఆశీర్వాదం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదర సోదరీమణుల ప్రేమ అనురాగం ఆత్మీయతలకు ప్రతీక రాఖీ పండుగ అని అన్నారు. అనుక్షణం సోదరుడి క్షేమం కోరుకునే వారు తోబుట్టువులు అన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆత్మకూర్: 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటర్ నమోదు చేయించుకోవాలని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సిబ్బంది ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆత్మకూర్ మండల బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. 2025 జనవరి నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి ఓటుహక్కు కోసం నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఆర్‌ఐ జయమ్మ, సీనియర్‌అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అమరచింత: ఓటరు జాబితా ప్రకారం ఓటర్ల వివరాలను నమోదు చేసుకొనేందుకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ రమేష్‌రెడ్డి అన్నారు. మండల బీఎల్‌ఓలతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఉంటున్న భార్య, భర్తల ఓట్లు వేర్వేరుగా ఇతర వార్డుల్లో నమోదై ఉంటే వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని, అలాంటి వారిని గుర్తించి ఒకే బూత్‌లో ఓటు ఉండేలా చూడాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్నందన నారాయణపేట జిల్లా ఆర్‌ఓ మియాంక్ మిట్టల్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌గా ఇంటింటి సర్వే చేపట్టాలని కోరారు. సమావేశంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐలు గోపాల్, సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌రెడ్డి



ఆత్మకూర్‌లో..

'ఐక్యంగా పోరాడుదాం'

వీపనగండ్ల: ఎస్సీ, ఎస్టీలను వర్గీకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాల పిలుపు మేరకు భారత్‌బంద్ మాలల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలల చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు వేటూరి రవీందర్‌దాస్ కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రసాదించిన హక్కులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని ఆయన కోరారు. బుధవారం మాలల చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించే భారత్‌బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం విభజించు పాలించు కార్యక్రమాన్ని అమలు చేయాలని చూస్తుందని, దీంతో పలువురికి రాబోయే రోజుల్లో నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మల్లేశ్వరంలోని ఐల్యాండ్ పరిశీలన

పెంట్లవెల్లి: పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో కృష్ణానది మధ్యలో దాదాపు 18 ఎకరాలతో కూడిన గుట్ట ఉంది. దానిని ఆ చుట్టుపక్కల గ్రామస్తులు ఐల్యాండ్‌గా పిలుస్తారు. ఆ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా మంత్రులకు, ఎమ్మెల్యేలకు అర్జీలు పెట్టుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో ఈ సంవత్సరం స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు 6, 7 సార్లు అర్జీ పెట్టుకున్నారు. అందుకు స్పందించిన మంత్రి, జిల్లా పర్యాటక శాఖ అధికారికి ఆ ఐల్యాండ్ పరిశీలించి వివరాలు సేకరించాలని తెలియజేశారు. మంగళవారం జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల్ల నర్సింహ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి మల్లేశ్వరంలో ఇంజిన్‌బోట్‌లో కృష్ణానదిలో వెళ్లి ఆ పెద్దగుట్టను పరిశీలించారు. అనంతరం వాటికి సంబంధించిన ఫొటోలు, భూమి వివరాలు తీసుకొని పూర్తి వివరాలు మంత్రికి తెలియజేస్తామని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, నాగరాజు, నర్సింహ నాయుడు, బాలరాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు పీహెచ్‌సీకి వైద్యుడి నియామకం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన డాక్టర్‌గా శ్రీహరినాథ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించారు. వైద్య సిబ్బందితో పరిచయ కార్యక్రమం చేపట్టి, సీజనల్ వ్యాధుల గురించి, జ్వరం సర్వే గురించి వైద్య సిబ్బందితో ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రశేఖర్, సిబ్బంది అమృతమ్మ, నీలమ్మ, స్వరూప, రాణి, రాజశేఖర్, రాజేష్ గౌడ్, మహిళా ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.



అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

అమరచింత: వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తూ రైతులకు ఎల్లప్పుడు సూచనలు, సలహాలు అందిస్తున్న ఏఈఓల సేవలు మరువలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి అన్నారు. మండలంలో ఏఈఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై నారాయణపేటకు వెళ్తున్న ఏఈఓ రాజేష్ వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని ఏఈఓ అందించిన సేవలను కొనియాడారు. మండల ప్రజలకు ప్రశ్నించే తత్వం ఉందని అధికారులతో తమ పనులు చేసుకొనేందుకు యత్నిస్తారే తప్ప వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టరని ఈసందర్భంగా గుర్తు చేశారు. ఏడున్నరేళ్లలో రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో రాజేష్ చూపించిన చొరవ అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఏఓ వినయ్, ఏఈఓలు మల్లేష్, హరిత, నాయకులు నాగభూషణంగౌడ్, తౌఫిక్, ఎల్ల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దకొత్తపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని జిల్లా ఉప వైద్యాధికారి వెంకటదాసు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలను, విద్యార్థులకు వండిన వంటలను, విద్యార్థులు నిద్రించే రూములు, తాగునీటి ట్యాంకులు, వాటర్ ఫిల్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసర ప్రాంతాలలో నీరు నిల్వకుండా, చెత్తాచెదారం లేకుండా బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించాలని ప్రిన్సిపాల్ అకుల్‌కు సూచించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులబారిన తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారి విజయ్‌కుమార్, రోహిత్, డీహెచ్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



భోజనం పరిశీలిస్తున్న అధికారులు

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

వనపర్తిటౌన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గీయులు వేరువేరుగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, కౌన్సిలర్లు వెంకటేష్, చీర్ల సత్యం, నక్క రాములు, విభూతి నారాయణ, జంపన్న, బాషానాయక్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు కోట్ల రవి, ఫిషరీష్ చైర్మన్ నందిమల్ల యాదయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, గణేష్ అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ 80వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రాజీవ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఎస్‌రావు, అశోక్, ఎస్టీడీ శ్రీను, గాలిపంపు శ్రీను, షబ్బీర్, బుచ్చన్న, నాగన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు స్థానిక చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, గొల్లబాబు, మేస్త్రీ శ్రీనివాసులు, వై.నరేందర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యశీలారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కొంకి వెంకటేష్, ప్రవీన్‌కుమార్‌రెడ్డి, శివన్న, నాగేశి, వెంకటయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రాజీవ్ గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు గంజాయి రమేష్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్యామ రాజు, డాక్టర్ నరేందర్‌గౌడ్, అజీమ్, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మదనాపురంలో..